


గుర్నాథం లోపలికెళ్ళి దీపం వెలిగించి వచ్చేవరకూ మాటలు వినిపిస్తున్నాయి సావిట్లోకి. నరసయ్య మహా ఉత్సాహంగా, హడావుడిగా మాట్లాడుతున్నాడు.

నాయుడుగారూ మీదాకా వచ్చింది! ఘంట కితం కరణంగారింట దస్తుదస్తంతా క్రిష్ణార్పణం అయిపోను... ఎవడో నల్లటాడు కోరమీసాలూ జులపాలూ వాడూ జీబూతంలా ఉన్నాడు ..కాకపోయినా అంత ఇదయితే ఎలాగండీ. ఎంత కరణవేనా ఇంట్లో అలా వేలకి వేలు దస్తు అట్టెపెట్టు కుంటే ఎలా? ఎప్పటిదప్పుడు పైకి పంపించెయ్యాలిగాని (ఎంతయ్యా పోయిందీ అంటున్నారు మునసబుగారు) ఆ ఇదంగా పరపతి కోసంటే పదీ పరకా సర్ది మునసబంత వాడనిపించుకోవాలని తాపత్రయం అది సరే గాని మాటవరస కడుగుతా మీరు ఇన్నాళ్ళు మునసబుగిరీ చేశారు. మంచాయె చెడ్డాయె రొఖ్ఖం అలా ఇంటో ఎక్కడపడితే అక్కడ పడేశా రండీ... అహ తెలీకడుగుతున్నా.... ఎంతన్నారు రొండొందలా... చూశారామరి, ఆపాటి మగసిరి లేకనే మీరు అంత కొద్ది రొఖ్ఖం అట్టె పెట్టుకోడం, ఆపాటి పెగ్గె మీకు లేకపోయిందా అంట. ఏవిటో ఎవడి మటుకు వాడు ప్రవేజకున్ననుకుంటాడు వాడితోటే ఆ విద్య పుట్టిందని— ఇదిగో మా వెధవా ఉన్నాడు పెవేజకత్తానికి. తెల్లారి మెయిలుబండికి చెన్నపట్నం వెళ్ళితీరాలి చచ్చితీరాలి అని పట్టుబట్టి కూర్చున్నాడు. వెధ వాయి. నాకేమో రేపు పున్నమెల్లిన తదియనాటిగ్గాని ఆ కోపరేటివు వాళ్ల లోను తగలెయ్యనంటున్నారు— ఆ వందా మీరిటు సర్దితే అది రాగానే ఫిరాయించేదాం. ఏదో ఆ పాటి పదిరూపాయలు చేతబట్టుకూచోగల మొగాడేడండీ వూళ్లో. ఎవడిమటుకు వాడికి భయమేనాయె— ఏ నర్సయ్య వచ్చి అప్పుదెమ్మంటాడో — ఏ నర్సయ్యవచ్చి కన్నంవేస్తాడోనని — జవాబు చెప్పే సత్తా లేకనేగిదా పెతివాడూ రొక్కందగ్గర పెట్టుకోంది. మన

కాలం ఇలాంటి జజ్జుతనం ఉండేదండీ— వంద చాలు. పున్నమెళ్ళిన తదియనాడు చంద్రోదయం వేళకల్లా మళ్ళా సర్దెయ్యనూ— పెద్దమనిషితో మాటా మరోటా— అబ్బాయా ఏమిటి—

అబ్బాయి గుర్నాథం దీపం పట్టుకువచ్చాడు.

మునసబుగారు మీసాలను లాలించి, గుర్నాథం సందుగు పెట్లో ఓ వంద దెచ్చి నర్సయ్యకివ్వు. పద్దు పుస్తకం గూడా పట్రా అన్నాడు గంభీరంగా.

నర్సయ్య గాలిదుమారంలా వచ్చి వెళ్ళిపోయాడు.

ఆ ఇందాక చెబుతున్న దేమిట్రా... అన్నారు మునసబుగారు.

అప్పులడిగే వాళ్ళదగ్గిర నువ్వెంత గట్టివాడవో చెబుతున్నావు అన్నాడు గుర్నాథం సావిడివంకచూసి నవ్వుతూ. అట్నించికూడా సన్నటి నవ్వు వినబడింది.

ఎవరక్కడా- కోడలా. నీక్కూడా నవ్వొచ్చెనే తల్లీ ... చూదాం రేపొద్దున్న నీ మొగుడెంత పెవేజికత్వం చూపిస్తాడో. నాదేముంది, అంతా అయిపోయె. మాకూ మాకూ మొహమాటాలుంటాయి. అదీకాక ఈ నర్సయ్యగాడు మహాటక్కరిలే. వస్తూనే ముందు నాదగ్గిర చేకాపుకి రొఖ్ఖం రెండొంచలుంటుందని చెప్పించుకున్నాడాయె. ఆనక మళ్ళీ కాదనకుండా, పరువా మరోటా నువ్వే చెప్పుతల్లీ అన్నాడు మునసబుగారు అంతకు మునుపే పారిపోయిన కోడలు నిల్చున్న చోటువేపు చూస్తూ.

గుర్నాధం సిగ్గుపడ్డాడు నవ్వినందుకు.

ఎలాగేనా నర్సయ్య మంచి ముండావాడు, మర్యాదస్తుడు, అన్నాడు మునసబుగారు ఓ నిముషం నిశ్శబ్దం మీద బింకంగా.

అవున్నాన్నా ఊళ్లో ఆయనకు వీధివీధినా అప్పులే. మర్యాదస్తుడు కాబట్టి అందరప్పులిచ్చుంటారు. మనకే ఆరు బస్తాలగింజ, దీంతో కలిపి నాలుగొందల రొక్కం ఇవ్వాలి. పద్దు బుక్కులో చూశాను.

పోన్లెస్తూ. అసలు వాడి మాటతీరుకీ, ఆ ఒడుపుకీ ఊరికినే ఇవ్వటప్పు వందాను. దీన్ని జూసైనా ఓ పాఠం నేర్చుకో. వందతో తెమిలిన అప్పుకాస్తా, వెయ్యిదాకా వెళ్ళలేదని సంతోషపడి దేవుడికో దణ్ణం బెట్టుకో.

అన్నట్టూ దేవుడంటే గుర్తొచ్చె— శివాలయంకాడ మా స్నేహితుడు పాపం కూర్చునుంటాడు నాకోసం — ఏం జెప్పనూ ? అన్నాడు గుర్నాధం లేచి నిలబడి.

మునసబుగారు ఓ నిముషం ఆలోచించి, పోనీ పైకం పట్టిగెళ్తావా నీ అంతవాడివి నువ్వాను అన్నారు.

కాదులే నాన్నా, రేపటికి వాయిదావేద్దాం అన్నాడు గుర్నాథం.

ఆఫీసు వీధి తూముమీద కాబూలీవాలాలా సిద్ధమైంది ఒకటో తారీఖు సాయంకాలం, గుర్నాధం ప్రాణానికి. బిక్కమొహం పెట్టి తండ్రి ఎదురుగా కూర్చున్నాడు.